క్లుప్తంగా

ఎస్పీని కలిసిన వయోవృద్ధులు

ఆదిలాబాద్‌టౌన్: వయోవృద్ధుల సమైక్య సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను మంగళవారం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్కలను అందజేసి శాలువాతో సత్కరించారు. ఇటీవల ఎస్పీ వివాహం జరగగా శుభాకాంక్షలు తెలిపారు. వయోవృద్ధుల సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు రామ్ కులకర్ణి, అఫ్సర్‌ఖాన్, ముస్తఫా, వామన్, నర్సిములు పాల్గొన్నారు.

తొడసం కైలాస్‌కు సన్మానం



కైలాస్ దంపతులను సన్మానిస్తున్న మౌనిష్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ద్వారా ప్రశంసలు పొందిన ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ దంపతులను సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అభినందించారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలో శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. గోండి భాషలో మహాభారతాన్ని అనువాదించడంతో పాటు యువత కోసం చాద్విచార్ అనే పుస్తకాన్ని రచించారని పేర్కొన్నారు. యూట్యూబ్‌లో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ద్వారా గోండి భాషలో వార్తలను రూపొందించడంతో మన్‌కీ బాత్‌లో ప్రధానం ఆయన పేరు ప్రస్తావించారని తెలిపారు. కార్యక్రమంలో రమేశ్‌బాబు, కాశీరాం, సురేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే'

నేరడిగొండ: విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ రావ్ అన్నారు. సోమవారం పీఎంశ్రీ పథకంలో భాగంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బు గుప్తా ఆదేశాల మేరకు లఖంపూర్ పాఠశాలలోని 150 మంది విద్యార్థినులు, హైదరాబాద్‌లోని ఇస్రో, టీహబ్, బిర్లా ప్లానిటేరియమ్, బిర్లా మందిర్, సెక్రటేరియట్, లంబిని పార్క్, అంబేడ్కర్ విగ్రహం, ట్యాంక్‌బండ్ తదితర ప్రదేశాలను సందర్శించారు. విద్యార్థులు అందరికి సైన్స్ టెక్నాలజీపై భాగస్వాములు కావడం, భావితరాల సైంటిస్ట్‌లుగా తయారు చేయడం, కొత్త ఇన్నోవేషన్స్ చేయడం, అవగాహన కల్పించడం జరిగిందని వివరించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నేరడిగొండ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అశోక్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, సాయన్న, నర్సయ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించవచ్చు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు, పాఠశాల పూర్వ విద్యార్థి, అసిస్టెంట్ ప్రొఫెసర్ రడాపు మధుసూధన్ మంగళవారం పదో తరగతి పరీక్షల పట్ల అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాసం, స్వీయ అధ్యయనం, సమాజంతో నడుచుకునే విధానం, పంచ సూత్రాలు, తదితర అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలకు ఎలక్ట్రిసిటీ బెల్, గ్రంథాలయ పుస్తకాలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఆయనను మర్యాద పూర్వకంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గిరిజాయి జాతర



దర్శనం కోసం వచ్చిన గిరిజనులు

తాంసి: భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ శివారులో పెన్‌గంగ నది ఒడ్డున ఉన్న గిరిజాయిమాత జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని భీంపూర్, గుంజాల, కరన్‌వాడీ, వడ్‌గాంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసీ కుటుంబాలు జాతరకు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భీంపూర్ మాజీ సర్పంచ్ లింబాజీ, కాశీరాం, అయ్యు, వినోద్ పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



భక్తులతో కలిసి రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- ఆకట్టుకున్న వేంకటేశ్వర స్వామి రథోత్సవం
- కిక్కిరిసిన భక్తులు

తలమడుగు: మండలంలోని బరంపూర్ కొండపై వెలిసిన శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

రథోత్సవం..



కొండపై కిక్కిరిసిన భక్తులు

శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంత్రం స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించారు. భాజభజంత్రీల మధ్య స్వామి వారి రథోత్సవం ముందుకు కదిలింది. స్వామివారిని, పూలతో అందంగా అలంకరించారు. శ్రీవేంకటేశ్వర స్వామి ఒకవైపు అలివేలు మంగ మరోవైపు లక్ష్మీదేవీలతో భక్తులకు రథంపై దర్శనమిచ్చారు. గోవింద నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అనంతరం రథం ఎదుట హోమం నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సందడే సందడే..

రథోత్సవం సందర్భంగా ఆలయంలో కొండపై పెద్ద ఎత్తున దుకాణాలు వెలిశాయి. స్వీట్లు దుకాణాలు, గాజులు దుకాణాలతో పాటు బొమ్మలు, ఆట వస్తువులు, తినుబండారాలు, తదితర దుకాణాలతో సందడిగా మారాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పల్లకి శోభాయాత్ర నిర్వహించారు. వేద పండితుల మధ్య అంగరంగవైభవంగా కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

బీజేపీ విజయోత్సవ సంబురాలు



టపాసులు కాల్చుతున్న నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఇచ్చోడ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి మల్క కొమరయ్య విజయం సాధించడంపై మంగళవారం బీజేపీ నాయకులు విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. టపాకాయలు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. మండల అధ్యక్షుడు రమేశ్, గుమ్మడి భీంరెడ్డి, మాధవ్ అమ్టె, కొల్లూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలో బీజేపీ సంబురాలు జరుపుకున్నారు. మంగళవారం డప్పుచప్పులతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు సీట్లు పంచిపెట్టి సంబురాలు చేసుకున్నారు. నాయకులు సంతోశ్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మహేందర్, పడాల పోచ్చన్న, నర్సారెడ్డి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు ఆరెల్లి రాజలింగు, ఆర్క ఖమ్ము, శివకుమార్ జైస్వాల్, మారుతి దేవ్‌పూజే, రాథోడ్ రాధిక, దిలీప్ మోరే పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టపాసులు కాల్చారు. స్వీట్లు పంచి పెట్టారు. బీజేపీ అభ్యర్థిని గెలిపించిన ఉపాధ్యాయులకు బీజేపీ మండల కన్వీనర్ బోరె రవీందర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్ సూర్య, అశోక్ రెడ్డి, తుకారాం, వెంకటేశ్, విజయ్, ఓస సాయి కుమార్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్: బీజేపీతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వేదవ్యాస్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించడంతో ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని వినాయక్ చౌక్‌లో సంబురాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో గంద్రత్ మహేందర్, జోగు రవి, దినేష్ మటోలియా, దయాకర్, రాకేశ్, భీంసేన్ రెడ్డి, జ్యోతిరెడ్డి, కొర్ర భూమేష్ పాల్గొన్నారు.

జాతరకు పోటెత్తిన భక్తజనం

- ప్రత్యేక పూజలతో ప్రారంభం



గర్భగుడిలో పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ మల్లన్న జాతర మంగళవారం ప్రారంభమైంది. ఉదయం ఆలయ పూజరి తృప్తి మహేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మల్లన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో వంటలు చేసి నైవేద్యాలను సమర్పించారు. జాతర సందర్భంగా వ్యాపారులు, తినుబండరాల దుకాణాలు, సర్కస్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పరిహారం చెల్లింపు

బోథ్: బోథ్ మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన మడావి సులోచన అనే మహిళపై అడవిపంది దాడి చేసింది. దీంతో ఆమె తీవ్ర గాయపడింది. కాగా ఆమెకు అటవీశాఖ అధికారులు రూ. 76,461ల నష్ట పరిహారం మంజూరు చేశారు. మంజూరు పత్రాన్ని మంగళవారం ఎఫ్‌ఆర్‌వో ప్రణయ్ కుమార్ మహిళకు అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి ప్రణయ్, అటవీ శాఖ సిబ్బంది పరశురాం, ఎఫ్ఎస్‌వో నాగోరావ్, ఎఫ్‌బీవో విఠల్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



టీకాలు వేస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: మండలంలోని అందునాయక్‌తండా గ్రామంలో మంగళవారం ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. 345 పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం మాట్లాడుతూ.. ఏఎంసీ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఉచితంగా నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, పశువైద్యాధికారి సుభార్, పడ్వాల్ గోపాల్‌సింగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డప్పుల ప్రదర్శన విజయవంతం చేయండి



మాట్లాడుతున్న అరెల్లి మల్లేశ్

ఇచ్చోడ: ఈనెల 7న ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్వహించే జిల్లా డప్పుల ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో నిర్వహించే డప్పుల ప్రదర్శనకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని షార్ప్‌గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదకలో లోపాలను సవరించాలని, మెజార్టీ మాదిగలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని, తదితర డిమాండ్లతో సభ జరుగుతుందన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు కుడల స్వామి, కాంబ్లే బాలాజీ, దుబాక సూభాష్, సిరిసిల్ల భూమయ్య, పసుల శ్రీకాంత్, చిట్టి రవి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను గెజిటెడ్ ఉద్యోగుల మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం చైర్‌పర్సన్ పి.అరుణ మాట్లాడుతూ 6, 7 తేదీల్లో మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి మహిళ ఉద్యోగులు, అధికారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు శారద, నవీన కళ, హారతి, సునీత, ఆశాజ్యోతి, దేవ్‌బాయి, శశికళ, రజిత, కృష్ణవేణి పాల్గొన్నారు.

సమయపాలన పాటించని వైద్యులు



వైద్యులు లేక ఖాళీగా కుర్చీ

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో మారుమూల గ్రామాల నుంచి వైద్యం కోసం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్నం అయ్యిందంటే చాలు ఆసుపత్రిలో వైద్యులు మాత్రం కనిపించరు. కిందిస్థాయి సిబ్బంది మాత్రమే వైద్యం చేసి పంపిస్తున్నారు. అత్యవసర సమయంలో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి లేదా ఆదిలాబాద్ రిమ్స్‌కు రిఫర్ చేస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక సాయం

కైలాస్‌నగర్ : ఇటీవల అత్యాచారానికి గురైన ఆదిలాబాద్ పట్టణంలోని రణదివేనగర్ కాలనీకి చెందిన ఓ బాలిక నివాసాన్ని కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి మంగళవారం వెళ్లారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క తరపున రూ. 25 వేల ఆర్థిక సాయాన్ని బాలిక కుటుంబానికి అందజేశారు. మంత్రి సీతక్కకు ఫోన్ చేసి బాధితురాలి కుటుంబసభ్యులతో మాట్లాడించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, రఫీక్, మునిగెల విఠల్, ముజాహిదీన్, అతీఖ్, షౌకత్ పాల్గొన్నారు.

క్రీడలతో సత్సంబంధాలు



బహుమతి అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

బేల: సరిహద్దు ప్రాంతాల మధ్యన క్రీడలతో సత్సంబంధాలు ఏర్పడుతాయని, గ్రామీణ యువత క్రీడల్లోనూ రాణించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దహెగాం శివారులో తిరంగ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన మాంగ్రీ(మహారాష్ట్ర) జట్టుకు మొదటి బహుమతి రూ.71వేల నగదుతో పాటు దహెగాం జట్టుకు రూ.50వేల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, వాంఖడే వామన్, బాపురావు హుల్కే, సామ రూపేష్‌రెడ్డి, ఫైజుల్లాఖాన్, వాంఖడే రూప్‌రావు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి



ప్రదర్శనలను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ రాంబాబు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీయాలని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సృజన టెక్‌ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను తిలకించారు. వాటి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాస్థాయి సృజన టెక్‌ఫెస్ట్‌కు ఉమ్మడి జిల్లాలోని బెల్లంపల్లి, నిర్మల్, ఉట్నూర్, ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాలల ఎలక్ట్రికల్, కంప్యూటర్ విభాగం విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఉత్తమ ప్రదర్శనలు ప్రదర్శించిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. లెక్చరర్లు సంగీత, క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కైలాస్‌నగర్: మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో బీపీ, షుగర్, టీబీ నిర్ధారణ పరీక్షలు చేశారు. వారికి అవసరమైన మందులు అందజేశారు. శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు ప్రారంభించి స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణాధికారి సుమలత, మున్సిపల్ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



ఆలయ ఆవరణలో భక్తుల సందడి

తలమడుగు: మండలంలోని కుచులాపూర్‌లో సాయిబాబా ఆలయ 29వ వార్షికోత్సవాన్ని ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛవం మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో బాలు మహరాజ్ ప్రవచనాలు బోధించారు. కాంగ్రెస్ బోథ్ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. అనంతరం సాయిపల్లకిని ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజేశ్వర్, దేవ్‌రావు, రణవీర్, సంతోష్, గంగారెడ్డి, సదాశివ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పరిశీలిస్తున్న సీఎస్ కేవీ కేశవులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో 294 మంది విద్యార్థులు, మైనార్టీ గురుకుల కళాశాలలో 227 మంది విద్యార్థులు, గిరిజన గురుకుల బాలికల కళాశాలలో 433 మంది విద్యార్థులు, గిరిజన గురుకుల బాలికల కళాశాలలో 345 మంది ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు ప్రిన్సిపాల్స్ తెలిపారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు మంగళవారం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, క్రిసెంట్ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 277 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 233 మంది విద్యార్థులు, క్రిసెంట్ కళాశాలలో మొదటి సంవత్సరం 170, రెండో సంవత్సరం 161 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు కళాశాలల ప్రిన్సిపాల్‌లు మారుతి, వినోద్ తెలిపారు.

నార్నూర్: సీసీ కెమెరా నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని వరండతో పాటు ప్రధాన గేటు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్ కేవీ కేశవులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షల కేంద్రంలో మొదటి సంవత్సరం 200 మంది, ద్వితీయ సంవత్సరం 274 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

తాంసి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి నుంచి ఇంటర్ పరీక్షలు జరుగనున్నాయి. అన్ని ఏర్పాట్లను మంగళవారం అధికారులు పూర్తి చేశారు. తాంసి కళాశాలలో మొదటి సంవత్సరం 454 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 402 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పరీక్ష కేంద్రం అధికారి శశికుమార్ తెలిపారు.

'విగ్రహం తొలగించడం సరికాదు'



మాట్లాడుతున్న జాదవ్ మహేందర్

నేరడిగొండ: ఇబ్రహీంపట్నం మండలం లోయపల్లి గ్రామంలో లంబాడాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని పోలీసులు అన్యాయంగా తొలగించడం సరికాదని లైవ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మళ్లీ విగ్రహాన్ని ఏర్పాటు చేయకపోతే లంబాడా ఏకమై పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. న్యాయ బద్ధమైన పద్ధతిలో పోరాడేందుకు, శాంతియుతమైన మార్గాల్లో తమ హక్కులను సాధించేందుకు లంబాడా సంఘం సిద్ధంగా ఉందన్నారు.

కూలర్లకు గిరాకీ



రోజురోజుకూ ఎండలు మండుతుండడంతో కూలర్లకు గిరాకీ పెరిగింది. మార్కెట్లో వివిధ రకాల కూలర్లు దర్శనమిస్తున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. – సిరికొండ